



కోటీ సెంటర్లో కోట్ల రూపాయలతో నిర్మింపబడ్డ ఆంధ్రాబ్యాంకు ఆఫీసులోపని చేస్తున్న మిత్రుడు ఆనంద్ ను కలుసుకుని అప్పుడే బయటకు వచ్చారు ఆంజనేయులు మేష్టారు ఆంజనేయులు మేష్టారూ ఆనందూ చిన్నప్పుడు బందర్లో యింటరు చదువుకున్నారు అంతగా చదువు అబ్బకపోయినా అదృష్టం కలిసి రావటంచేత ఆనంద్ ఆంధ్రాబ్యాంకులో ఉద్యోగం సంపాదించగలిగాడు రాజధానీ నగరం చేరాడు చదువులో చురుకుతనం ఉన్నా అవకాశాలు ఆర్థికావస

రాలు అంతగా బాగుండకపోవటంచేత పెద్ద చదువులు చదువుకోలేక ఎలాగో డిగ్రీ పూర్తిచేసి ట్రైనింగయి 'వృత్తులలో కెల్ల ఉత్తమం ఉపాధ్యాయవృత్తి' అని పేరుపొందిన మేష్టరిగిరీలో చేరారు ఆంజనేయులుగారు. తక్కువ చదువు చదువుకున్నా తనకన్నా యెక్కువ సంపాదిస్తూ పట్టణంలో కాలక్షేపం చేస్తున్న మిత్రుడు ఆనంద్‌ను చూచి మనస్సులో యెక్కడో ఓమూల ఈర్ష్య లాంటిది ఓ తుక్కుమన్నా, చాలా ఆనంద పడిపోయాడు ఆంజనేయులుమేష్టారు! ఆంజనేయులుమేష్టారు అంత ఆస్తి పరుడు కాకపోయినా తిండికి లోటులేని వాడు. ఆనంద్‌తో పోల్చి చూసుకుంటే మాత్రం కొంచెం తక్కువస్థితిమంతుడే! ఏమిటో ఈ తేడాలు! ఎక్కడికో యీ వ్యత్యాసాల అంతం! ప్రతి వ్యక్తీ మరొక వ్యక్తో మిత్రుడో తారసపడగానే యిలాగే పోల్చుకుంటా డేమో! ప్రతివాని మనస్సులోనూ యీ రకమైన తారతమ్యపట్టిక తయారవు తూనే ఉంటుందేమో! లేకపోతే యేమిటి? ఆనంద్ స్థితిని చూచి తన స్థితిని పోల్చుకుని ఏం లాభం? ఏమన్నా కలిసివస్తుందా? ఏది ఎమైనా ఆనంద్ హృదయం మాత్రం అతిసున్నితం, అతి సుకుమారం తన స్థితిగతుల గురించి యెన్ని ప్రశ్నలు వేశాడు? ఎంత బాధ పడ్డాడు! మెదడులో మెదులున్న యీ ఆలోచనా పరంపరతో మెట్లు దిగి బ్యాంకుపక్క రోడ్డులోకి మళ్ళాడు పల్లెటూళ్ళో ఉద్యోగం చేస్తూండడం వల్ల కాబోలు పట్టణంలో రోడ్డు రూల్సు పట్టించుకోలేకపోయాడు ఆంజనేయులుమేష్టారు! రోడ్డుకు ఎడమ ప్రక్క నడవాలనీ, పేవ్‌మెంటుపైననే నడవాలనీ ఆంజనేయులు మేష్టారికి తెలియక కాదు! అసలా మాట వస్తే ఈలాటి విషయాలన్నీ పాఠాల్లో పిల్లలకు బోధించి చెప్పేది ఆయనే! అలాటిది ఆయనకు తెలియకుండా ఎలాగుంటుంది? కాని ఆ రోజు ఆలోచనల్లో పడ్డ ఆంజనేయులు మేష్టారికి తన వెనకాల అంతక్రితం అయిదారు సెకండ్ల నుంచీ హారను మ్రోగుతూన్న శబ్దం కాని, అంత స్పీడులో వస్తున్న ఆ చిన్న కారు—సరిగ్గా తన కాళ్ళవెనకాలే రఝున బ్రేకుపడ్డ విషయంగానీ తెలియనేలేదు కారు ఆగినక్షణం ఎందుకో ఉలిక్కిపడ్డ ఆంజనేయులుమేష్టారు వెనక్కి తిరిగారు Right about turn చేసేందుకు కూడా చోటులేనంత ఎడంలో ఆ కారు ఆగింది

'ఏం స్వామీ! మీ ప్రాణాలు పోగొట్టుకోవాలనా! మా ప్రాణాలమీదకు తేవాలనా! హారను కొట్టికొట్టి ప్రాణం పోయింది!" అంటూ ఓ ముప్ఫైయేళ్ళ కుర్రాడు (ఆంజనేయులుమేష్టారిదృష్టిలో అంతే మరి) కళ్ళ గాగుల్సు తీస్తూ కారు దిగాడు.




"పొరపాటయింది నాయనా! విని పించలేదు!" అంటూ జాలిగా క్షమాపణ చెప్పుకోబోయాడు ఆంజనేయులు మేష్టారు!

"మేష్టారూ! మీరా! పొరపాటున యేదో అనేశాను! excuse చేయండి రండి! రండి! యెక్కడుంటున్నారు?" అంటూ ఆ యువకుడు అమాంతం ఆంజనేయులు గారి రెండుచేతులు (అవే కాళ్ళనుకుని) పుచ్చుకుని ప్రాదేయపూర్వకంగా కార్లోకి తీసికొచ్చాడు

ఆంజనేయులు మేష్టారికి దేం అర్థం కావటంలేదు! మంత్రముగ్ధుడిలా ఆ యువకుడు చెప్పిన ప్రకారముగానే చేసి కారో వెనకాలసీట్లో కూర్చున్నాడు! ఆ యువకుడు స్టీరింగు ముందు కూర్చుని ఓసారి హారను కొట్టి కారు స్టార్టు చేశాడు గాలికన్నా వేగంగా గాలిలో దూసుకుపోతోంది కారు! మేష్టారికి అంతా అయోమయంగా ఉంది! ఆకుర్రవాడెవరో తన నిలా యెందుకు కారెక్కించాడో, అన్నిటికన్నా ముఖ్యం తన నిప్పుడు యెక్కడకు తీసికెళ్ళిపోతున్నాడో యేమో! యివన్నీ అర్థం కావటంలేదు ఒక్కసారి వెనక్కి తిరిగి చూశాడు తన సీటు వెనకాల ప్లాస్టికు బుట్టలో చక్రకేళిపళ్ళు యాపిల్సు ఉన్నాయి ప్రక్కనే ఏవో పుస్తకాలు పేపర్లు ఉన్నాయి

'పళ్ళు తీసికోండి! మేష్టారూ!!''

అన్నాడు ఆ యువకుడు వెనక్కి తిరగకుండానే

ఆంజనేయులు మేష్టారికి చచ్చేటంత సిగ్గేసింది! 'తను పళ్ళకేసి చూసినట్లు వానికోసమే తను చూసినట్లు ఆతని కెలా తెలిసిందబ్బా!' అనుకున్నాడు ఇంతలో ఆ యువకుని ముందున్న అద్దం మీద పడింది ఆయన దృష్టి అరె! స్కూల్లో పిల్లలకు చెప్పిన విషయమే తనకు గుర్తులేకపోయిందే! కారు డ్రైవరుముందు కుంభాకార దర్పణం ఉంటుందని డ్రైవరు వెనుక ఉండే దృశ్యం చిన్నదిగా అందులో కనిపిస్తుందనీ తనేగా బోధించినది! ఏమిటో వార్థక్యం మీద పడుతోంది! జ్ఞాపకశక్తి తగ్గుతోంది కాబోలు! కారు యెక్కడా ఆగటంలేదు మలకపేటకేసి పోతోంది ఆ యువకుని దృష్టి అంతా స్టీరింగుమీదే ఉంది! తనతో మరొక్కమాటన్నా మాట్లాడడంలేదు! ఆంజనేయులుమేష్టారికి ఎందుకో ఒక్కసారి భయమేసింది! పట్టణాల్లో మోసాలు ఘోరాలు హత్యలు అతివింతగ జరుగుతూంటా యని ఆనోటా ఆనోటా విన్నాడు అక్కడక్కడా చదివాడు! కొంపతీసి ఈతను కూడా అలాటి అఘాయిత్య మేదైనా తలపెట్టడం లేదు కదా? అయినా తన దగ్గ రేముంది కనక! డబ్బా' ' స్కావా! రక్తమాంస రహితమై చిక్కి శల్యమౌతూ న్న అస్థిపంజరం! అంతేగా! ఈ మాట తలుచుకునేసరికి ఆంజనేయులుమేష్టారికి తమ శరీరాల గురించి ఎప్పుడో ఎక్కడో రాసిన రెండు వ్యాక్యాలు గుర్తుకొచ్చాయి!

"నల్లబల్లపై రాసే తెల్ల సుద్దలా
రక్తం లేక తెల్లబడేను మా దేహాలు!"

అంటూ ఓసారి మేష్టార్ల గురించి కవిత్వం వ్రాశాడు తను! ఇంతకూ ఇతని ఉద్దేశ మేమిటో! ఎంతో ఆప్యాయంగా "మేష్టారూ! మీరా!" అంటూ పల్కరించాడు, ఎవరై ఉంటాడు! గుర్తే రావడం లేదే! మొత్తానికి ఎప్పుడో ఎక్కడో చదివిన శిష్యుడే అయి ఉంటాడు శిష్యుడంటే గుర్తొచ్చింది ఆ మధ్య వా డ్నెవడినో కొట్టబోతే బెత్తం లాక్కుని తననే కళ్ళెర్రచేసి చూశాడు అలాటివాడేనేమో ఈ మహానుభావుడు! పాత పగ ఏమన్నా ఉంటే యివాళ తీర్చుకుందా మనుకుంటున్నాడేమో! 'బిడ్డ చచ్చినా పురిటి వాసన పోలేదు' అన్నట్టు రిటైరవబోతున్నా యింకా తనమీద కొంతమందికి యిలా కార్పణ్యం ఉంటుందేమో! ఎక్కడికో ఊరివెలుపలికి తీసికొనిపోయి నిలబెట్టి నాలుగు తన్ని ప్రాణాలు తీయడుకదా! అమ్మో! తను చచ్చిపోతే ఇం కేమన్నా ఉందా! తన సంసారం ఏమైపోవాలి! మంచంలో పడి యింకా ప్రాణం పోకుండా మూల్గుతూన్న తన తల్లి యేం కావాలి? తల్లి తర్వాత చూసుకుంటే

రోగంలో తీసికుంటున్న తన భార్య గతేం కావాలి? పెద్దదానికి పెళ్ళెవరు చేస్తారు? యివన్నీ తలపుకు రాగానే ఆంజనేయులుమేష్టారి గుండె ఝల్లుమని ఆగిపోయినంత పనయింది. అంత దడలోనూ ఆ మధ్యెక్కడో పత్రికలో ప్రచురింపబడిన గేయంలో పంక్తులు గుర్తుకొచ్చాయి నిజానికి అది గేయం కాదు తనబోటి అభాగ్యజీవుల హృదయాల్లో మాయని గాయం ఆ మాటకొస్తే కవిత్వం దృష్ట్యా చూసినా అది గాయమే' ఓ ఛందస్సూ లేదు, ఓ నడకా లేదు' ఏదో భావకవిత్వంట, భావకవిత్వం' నాల్గు మాటలు రెండేసి లైన్లుగా వ్రాసేస్తే గేయమయిపోతోంది అసలు ఆ గేయంలో భావమంతా తనదే' దాన్నంతా పద్యరూపంలో వ్రాయాలని తన కెన్నాళ్ళనుంచో ఆలోచన' కాని యీలోగా ఎవరో యువ రచయిత గేయమంటూ వ్రాసేశాడు ఏం లాభం! యిప్పుడు తను పద్యం వ్రాసినా, కాపీ చేశాడని అంటారు అంతా! కాపీ అంటే తనకి తగని మంట' తను చదువుకున్నన్ని రోజుల్లోనూ ఒక్కనాడూ కాపీ చేసిఎరుగడు! అందుకేగా అయిదు సార్కాల్లో ఇస్కూలు ఫైనలు పరీక్ష తప్పాడు' అంతేనా! తను సర్వీసులో యిన్నాళ్లూ ఒక్కసారైనా ఒక్క పిల్లాడ్నైనా, ఆడపిల్లనైనా కాపీ చేయనిచ్చాడా? ఎందుకు చేయనిస్తాడు' అది తన సిద్ధాంతానికి విరుద్ధం' ఇంతకీ ఆ యువరచయిత ఏం వ్రాశాడో ఇప్పుడు గుర్తుకు తెచ్చుకున్నాడు

"జగతిఁ జూడ కనులు లేక
మంచ మెక్కి మూల్గు వృద్ధమాత,
వయసు ముదిరి, మనసు చెదరి
పెళ్ళి కాక కుళ్ళుచున్న పెద్దపిల్ల,
మనసుపడ్డ చదువుకొరకు
కోరుకున్న సీటు రాని చిన్న కొడుకు,
తల్లిపాలు త్రాగ తనివితీరక
గొల్లభామ కైగోలచేయు పిల్లవాడు-"

ఇంకా చాల వ్రాశాడు అంతా గుర్తు లేదు అంతా తనగురించే వ్రాసినట్లుగా ఉంది ఆ ఆఖరి చరణాలు, ఆ పిల్లవాడు తప్ప తక్కినవన్నీ తన సంసారానికి సరిగ్గా అతికిపోతాయి తన సంసారానికే అనేం ఖర్మ- తనలాటి నిర్భాగ్య సంసారాల్లో యెన్నింటికైనా సరిపోతాయి అందుకే రచయిత అంటే సమాజ ప్రతిబింబమని ఆ మధ్య ఎవరో అన్నట్లు గుర్తు! తనకి అసలు ఓ పెద్ద రచయితగా చెలామణి అయిపోవాలని ఎంత కాలంనుంచో కోరిక' కాని ఏం లాభం! ఆ కోరిక తీరకుండానే తను చావడమా

కారు రక్కన ఓ చిన్న దాబా ముందు ఆగిపోవడంతోనే ఆంజనేయులు మేష్టారి ఆలోచనలకూడ బ్రేకు పడిపోయింది ఆ యువకుడు ముందు దిగి, డాక్ దోరు తీసి "దిగండి మేష్టారూ'" అన్నాడు ఇంతలో ఓ పధ్నాలుగేళ్ళ

కుర్రాడు వచ్చి బాక్‌సీట్లో ఉన్న పళ్ళ బుట్ట, పేపర్లు తీసికెళ్ళాడు। ఆ యువకుడు కాంపౌండు గేటు దాటి లోపలికి ప్రవేశిస్తూ ఉంటే ఆంజనేయులుగారు మౌనంగానే అనుసరించాడు' ఏం జరుగుతుందో ఊహించనైనా ఊహించలేని పరిస్థితుల్లో

"రాధా! రాధా!!" అంటూ కేకేశాడు

ఆ యువకుడెవడో ఆ రాధ ఎవరో, ఈ కథేమిటో అంతా అగమ్యంగా ఉంది మేష్టారికి! ఇంతలో ఓ ఇరవై యేళ్ళ అమ్మాయి అమ్మాయి అనే కంటే అందాలభరిణె కుందనపుబొమ్మ - ఆంజనేయులుమేష్టారుముందు నిలబడింది చక్కగా శుభ్రంగా అందంగా అలంకరించుకున్న ఆ అమ్మాయిని చూస్తుంటే, అలంకారం చేస్తే తన పెద్దమ్మాయి యింత అందంగా ఉండక పోతుందా అనిపించింది

"రాధా! ఈయ నెవరో తెలుసా! మా గురువుగారు! ఆంజనేయులుమేష్టారని అస్తమానం నీకు చెప్తూండే వాడిని నా జీవితానికి మహోపకారము చేశారని ఆయనే యీయన మన అదృష్టంకొద్దీ ఇన్నాల్టికి యివ్వాళ అనుకోకుండా కలిశారు ఏం మేష్టారూ! నన్ను యింకా గుర్తేపట్టలేదా! నేను

మీ శిష్యుడ్ని అల్లరి కోటేశ్వ్రరావుని' అంటూ అంతవరకూ అతిబలవంతంమీద Maintain చేసిన మౌనానికి భిన్నంగా గబగబ మాట్లేశాడు

నమస్కారమండి' కూర్చోండి! వస్తాను ' అంటూ ఆ రాధ ఇంట్లో కెళ్ళిపోయింది ఆంజనేయులు మేష్టారికి అప్రయత్నంగా ఒళ్ళంతా పులకరించింది కళ్ళల్లో నీళ్ళు నిలవాయి

అమాంతం కోటేశ్వ్రరావుని కౌగలించుకోకుండా ఉండలేకపోయాడు

"యిలా యీ సోఫాలో కూర్చోండి' స్నానం అవీ చేద్దురుగాని" అంటూ పైన ఫానువేసి తనూ ఇంట్లోకి వెళ్ళాడు

ఇంతలో రాధ ఓ గ్లాసుతో - గాజు గ్లాసుతో చల్లనిడ్రింకు తెచ్చింది "తీసికొండి ఎండలో వచ్చారు మీ గురించే అస్తమానూ చెప్తూంటారు మిమ్మల్ని తలవని రోజులేదు' అంటూ ఎంతో స్వచ్ఛంగా వినయంగా పలికింది రాధ ఆంజనేయులుమేష్టారు త్రాగిన గ్లాసు తీసికొని రాధ యింట్లోకి వెళ్ళిపోయింది పైన తిరుగుతున్న ఫాను చల్లగాలికి కుర్చీలో - సోఫాకుర్చీలో నడుం జేర్లవేసి ఒక్కసారి కళ్ళు మూసి మళ్లీ తెరిచాడు ఆంజనేయులుమేష్టారు ఆ యింటిప్లాను అలంకారం అంతా ఎంతో నచ్చింది ఆయనకు! చిన్నసైజులో చక్కటి డాబా! చుట్టూ కాంపౌండు గోడ గేటు గేటుదాటి లోనికొస్తే చక్కని మొక్కలతో చిన్నగార్డెన్ మధ్య దారి

దారి తిన్నగా డాబా ముందుకే తీసి



కెడుతుంది _ ముందు వరండా దానికి కుడిప్రక్క చిన్నరూము అదే డ్రాయింగు రూము వరండా అనుకుని హాలు, హాలు కుడిప్రక్కగా, డ్రాయింగురూము వెనక Bed room, హాలు వెనుక డైనింగ్రూమ్, దాని కుడిప్రక్క kitchen లాగుంది

ఆ వెనుక కొంచెం ఖాళీస్థలం దొడ్లో పంపు Latrine, Bath room కూడ ఉండేఉంటాయి హాల్లో Fan క్రింద కూర్చుని ఒక్కసారి చుట్టూ దృష్టి సారించిన ఆంజనుయులు మేష్టారి కంటికి కనిపించిన యీ యింటి దృశ్యము ఇది ఇల్లంతా ఎక్కడి కక్కడ అధునాతనమైన Furmiture తో నిండిఉన్నది గోడలనిండా చక్కచక్కని ఫోటోలు అలంకారాలు, Bed room లో గాడ్రోలు

చిన్నగా, సన్నగా రేడియో పాడుతోంది। ఎంత లేదన్నా ఈ చిన్న డాబాకు పదిహేను వేల పైచిలుకు అయివుంటుంది। ఎంత వింతగా ఉందీ। తనకు సర్వీసులో ఉన్నంతకాలం ఇదే మోడల్‌లో డాబా కట్టుకోవాలని కోరికగ ఉండేంది అంతా యిదే డిజైను తన మనసులో భావాన్ని పసిగట్టేసి యీ యువకుడు, యింకా యువకు డేమిటి! కోటేశ్వరరావు కట్టేసినట్టున్నాడు! ఇదే విధి విచిత్రం– తన కోరిక యింకొకరి మదిలో మెరిసి ఫలించటం। ఎంత వింత ?

"లేవండీ మేష్టారూ। స్నానం చేద్దురుగాని," అంటూ సదరు అల్లరి కోటేశ్వరరావు పిలవడంతో మళ్ళీ యీ వాస్తవిక ప్రపంచంలోకి వచ్చారు ఆంజనేయులు మేష్టారు

'ఇప్పు దేం స్నానం అబ్బాయి ?'' అన్నారు ఆయన యిబ్బందిగా మొహం పెట్టి

అ దేం మాట మేష్టారూ। వేసవి కాలం – ఎండతీక్షణత। సమయం పద కొండుగంటలు యిలాటి సమయంలో వచ్చి స్నానం చేస్తే ఎంత హాయిగా ఉంటుం దనుకున్నారు।' అంటూ ప్రక్కనే ఉన్న కుర్రాడి చేతిలో తుండ్లు తనే తీసుకొని మేష్టారి చేతికి ఇచ్చాడు కాదనలేక మేష్టారు అతడు కోరినట్లే స్నానం ముగించాడు। స్నానం ముగించి వచ్చేసరికి వీధిగదిలో అంటే డ్రాయింగు రూములో అద్దం దువ్వెన oil సీసా వగైరా అమర్చబడ్డాయి అక్కడే కుర్చీలో క్రొత్త లుంగీపంచే తుండూ ఉన్నాయి

'కట్టుకోండి మేష్టారూ।" అన్నాడు కోటేశ్వరరావు

చేసేదిలేక అలాగే కట్టుకున్నారు మేష్టారు।

'వడ్డించాను। లేవచ్చును " అంటూ యింతలో రాధ గుమ్మంలో ప్రత్యక్షమయింది। మేష్టారి గొంతులో వెలకాక్కాయపడింది "నా భోజనం అయి పోయింది నాయనా।' అన్నారు

"నా భోజనం యింకా కాలేదు నా కోసమైనా మళ్ళీ ' అన్నాడు కోటేశ్వ రావు।

'మా యింట్లో భోంచేయకూడదని ఏమన్నా నియమం ఉందాండీ। అంది చనువుగా రాధ। •

"లేదమ్మా। పదింటికే భోంచేసి బాంకులో మిత్రుడ్ని కలుసుకుందామని వచ్చాను

"అయితే పోనీ రండి। ఫలహారం చేద్దురుగాని నాతో కబుర్లు చెప్పుతూ," అన్నాడు కోటేశ్వరరావు

ఆతని యిష్టప్రకారమే ఆకలి లేక పోయినా ఆంజనేయులుమేష్టారు ఆతని ప్రక్కనే కూర్చుని రాధ చేసిన స్వీటు, హాటు తిన్నాడు మళ్ళీ డ్రింకు త్రాగాడు, పళ్ళు తిన్నాడు

"ఏం మేష్టారూ! ఎన్నాళ్టికి నా కోరిక నెరవేరింది? మీ మేలు జన్మలో మర్చిపోలేను! మిమ్మల్ని తలవని రోజు అంటూ లేదు ' అంటూ ప్రారంభించాడు కోటేశ్వర్రావు భోజనానంతరం!

' నే నేం చేశాను నాయనా! నిజంగా చెప్తే నేను నీకు తీరని అపచారము చేశాను ''అన్నారు బాధగ మేష్టారు!

' కాదు! మేష్టారూ! కాదు! మీరు నా పట్ల మహోపకారం చేశారు! ఆనాడు మీరు అలా చేసిఉండకపోతే నే నీనాడు యీ స్థితిలో ఉండేవాడిని కాను యీ నాడు యిలా స్వంత ఇంట్లో పెళ్ళాం బిడ్డలతో హాయిగా ఉండగల్గుతున్నానంటే అదంతా మీ చలవే! ' అంటూ తన జీవిత చరిత్ర చెప్పబోయాడు

' పక్కదులిపియేసినా నయ్యగోరూ!" అంటూ నౌకరుకుర్రాడు వచ్చి చెప్పటంతోనే కోటేశ్వర్రావు వెంటనే "మేష్టారూ! కొంచెం రెస్టు తీసుకోండి నిద్రపోయిలేచాక తీరుబడిగా మాట్లాడుకుందాము!" అంటూ ప్రక్కనే అమర్చిన మడతమంచంకేసి చూపించాడు అంజనేయులు మేష్టారు ఆరోజు యేదీ కాదనలేకపోతున్నారు శిష్యుడు చెప్పినట్లుగానే లేచి వెళ్ళి మంచంమీద నడుం వాల్చాడు కోటేశ్వరరావు లేచి పడకగదిలోకి వెళ్ళిపోయాడు ఇంతలో పిల్లలు యెక్కడినుంచి వచ్చారో ఇద్దరు—ఒక మగపిల్లవాడు ఒక ఆడపిల్ల—పని చేసే పిల్ల తీసుకువచ్చినట్టుంది ఇద్దరూ గబగబా గంతులేస్తూ యింట్లో కొచ్చారు లోపలికి పోతూ పోతూ మంచంమీద పడుకున్న తన ముసలిదేహంకేసి ఓసారి వింతగా చూసి నవ్వుకుంటూ వెళ్ళిపోయారు ఇద్దరే కాబోలు పిల్లలు అదృష్టము అలాగుండాలి! పరిమిత సంసారమంటే! ఏం లాభం? తనకు పదిమంది సంతానం! తన తండ్రికి తాము ఎనమండుగురు ' పూర్వకాలంవాళ్ళకు యీ సంతాన విషయంలో అంత పట్టింపులుండేవికావు కాబోలు! అవును, ఆ రోజులే వేరు ఆ మనుష్యుల తీరే వేరు! ఎంత కండపుష్టి, తిండిపుష్టి కలిగిఉండేవారు తన తండ్రి తినే తిండి చూస్తే యీనాటికి ఆశ్చర్యమేస్తుంది ఈకాలమే వేరు అంతా అర్భకులే పుట్టున్నారు గట్టిగా ఓముద్ద తినలేరు ఓపని చెయ్యనూ లేరు ఏం లాభం దీనికితోడు కరువు కాలం గట్టిగా తిందామన్నా తిండి దొరుకుతోందా తిండి అంటే గుర్తుకు వచ్చింది పాపం! ఈ మహాపట్టణంలో యీ కోటేశ్వర్రావుకు బియ్యం దొరుకుతున్నాయో లేదో? తనకంటే ఏదో—ఆ యెకరన్నర పొలంమీద తిండిగింజలొస్తున్నాయి కాబట్టిగాని లేకపోతే బియ్యానికెంతమంది దిబ్బంది పడిపోతున్నారు? ఏమైనా పరిస్థితుల దృష్ట్యా పరిమిత సంసారమే అన్నివిధాల యోగ్య

మైనదని తనకే యిప్పుడిప్పు డనిపి స్తోంది కాని ఏంలాభం? తన చెయ్యి దాటిపోయింది ఇక యిప్పు డేమనుకు నేం లాభం? ఈ తెలివితేటలు ముందే ఉంటే బాగుండేది కాలంబట్టి మనుషులు మారుతూంటారు అందుకే గాబోలు రెండేళ్ళక్రితం సర్వీసులో చేరిన సైన్సు మేష్టారు ఇద్దరుపిల్లలు పుట్టగానే జాగ్రత్త పడ్డాడు ఈ కోటేశ్వర్రావుకూడా అంతే చేసిఉండటాడు ఏమిటో! ఛాందసులు— పూర్వకాలపువాళ్లు యింకా పాతవాసనలు పోక బ్రహ్మహత్యాపాతకం అంటారు సంతాన నిరోధాన్ని చూసి ఇప్పుడు తన నిర్భాగ్యుడు చేసే దేమిటి? సజీవసమాధి బ్రతికుండగానే బలవంతాన ఆకలిబాధకు బలిచేయడం తప్ప మళ్ళీ ఇంటిమీదకు పోయింది ధ్యాస ఇంటిదగ్గర్నుంచి బైలు దేరి ఐదురోజు లయిపోయింది పెద్దాడు రమ్మంటే ఓసారి చూసిపోదామని వచ్చాడు తాను యీ మహాపట్టణం అను కోకుండా తారసపడ్డాడు యీ కోటేశ్వ ర్రావు కోటేశ్వర్రావు—ఎంత మారి పోయాడు ఆ రోజుల్లో — చదువుకునే రోజుల్లో తన దృష్టిలో అల్లరి కోటే శ్వర్రావు. ఈనాడు ఓ పెద్దమనిషి—డబ్బు, హోదా ఉన్న మనిషి అస లింతకూ యిప్పు డేం చేస్తున్నాడో! ఏమన్నా ఉద్యోగం చేస్తున్నాడా? లేక ఉద్యోగం చేయాలంటే తగినంత చదు వేది? తనేగా చేతులారా వీడి చదువు నాశనం చేసింది తలచుకుంటే యీనాటికి తన హృదయం బ్రద్దలయిపోతుంది. తనేగా వాడి జీవితాన్ని నాశనం చేయాలనే తలంపుతో రిపోర్టు చేయలేదు ఆనాడు ఆలోచిస్తూంటే ఆనాడు జరిగిన ఘట్టం కళ్ళముందు కదలాడింది

* * *

సరిగ్గా పదిహేనేళ్ళక్రిందట కాబోలు జరిగింది అపుడు యీ కోటేశ్వర్రావు ఫిఫ్తు ఫారం చదువుతున్నాడు చదువులో బండి అల్లరిలో పక్కపిల్లలకు అండ తాను లెక్కలు చెప్తున్నాడు ద్వివర్ణ సమీకరణాలు ఒక పట్టాన అర్థమయేవి కావని తన అభిప్రాయము ఉన్న పది మందికీ శ్రద్ధగా చెప్పాలని తన అభి లాష బోర్డుకేసి తిరిగి తను లెక్కలు చెప్తుంటే లెక్కలు చేస్తున్నట్టు, బోర్డు మీద వ్రాసినవి ఎక్కించుకుంటున్నట్టు నటిస్తున్నాడు కోటేశ్వర్రావు ముందు తనూ ఊహించలేదు నిజంగానే లెక్కలు చేస్తున్నాడు కాబోలు అనుకున్నాడు కాని పక్కకుర్రాడు ఎందుకనో కోటేశ్వ ర్రావు పుస్తకం చూసి అదేపనిగా నవ్వు కుంటున్నాడు బలవంతాన వచ్చే నవ్వుని ఆపుకోలేక అవస్థపడుతున్నాడు దాంతో తనకు అనుమానం వేసింది ఒక వేళ అతను లెక్కలు చేయకుండా ఏమన్నా నోట్సు రాస్తున్నాడేమోనని ఒక్క క్షణం చూడనట్టు ఊరుకుని వెంటనే వెళ్ళి నోట్సు చూపించమని




అన్నాడు ఏం లెక్కలు చేశావో చూపమన్నాడు ''అబ్బే' అబ్బే! పెన్నుే రాయటంలేదు అంటూ దబాయించబోయాడు తా నేం అంత తెలివితక్కువ వాడా ' ఆ కుర్రవెధవ మాటలు నమ్మటానికి ' మరయితే యిందాకటినుంచీ రా స్తున్న దేమిటో చూడనీ!'' అంటూ పుస్తకం లాక్కున్నాడు తాను ఆ పుస్తకం లాక్కోబోతుంటే కోటేశ్వ్రరావు దాన్ని దాచేయబోతాడు దాంతో అనుమానం యింకా యెక్కువయింది గట్టిగా ఒక్క పట్టుపట్టి లాగేశాడు పుస్తకాన్ని అటూ ఇటూ తిప్పి చూశాడు ముం దేం కనపడలేదు తిరిగి యిచ్చేయబోతూ యెందుకో అట్టపక్క నున్న రాత చూశాడు అంతే! తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు తన కాళ్ళక్రింద భూమి క్రుంగిపోయినట్లనిపించింది ఆ సమయంలో ఏం చేయాలో తోచలేదు ఇంతకూ అక్కడ రాసిం దేమిటంటారేమో! సన్నగా, గడకర్రలా ఓ మనిషిబొమ్మ వేసి చేతిలో బెత్తం పెట్టి దాని కింద యిలా రాశాడు

'మా లెక్కల మేష్టారు, మాష్టర్ రమణారెడ్డి ' తనకు ఒళ్లు మండిపోయింది వాడి రక్తం కళ్ళచూడా లనిపించింది నిజానికి ఆ సమయంలో కోటేశ్వరావుకూడా భయంతో వణికిపో

యాడు చేతిలో బెత్తం వుంటే అంత పనీ చేసేవాడే అలా చావగొట్టినా బాగుండేది వెంటనే ఆ పుస్తకాన్నీ, కోటేశ్వర్రావునీ హెడ్మాష్టరు రూముకు పంపించేశాడు హెడ్మాష్టా రంటే అందరికీ సింహస్వప్న మే, అందరికీ హడలే ఆయన చండశాసనుడు చండామార్కులని పేరుకూడ ఉంది ఆయనకు ఈ కేసు చూసేసరికి ఆయన అకాశమంత యెత్తున లేచి మండిపడ్డాడు ఈ పరాభవము తనకే జరిగిందన్నట్టు బాధపడ్డాడు దానికి తగ్గశిక్ష వెంటనే వేసేశాడు ఏముంది? టీ సి యిచ్చి పంపేశాడు మర్యాదగా టీ సి తీసికొని వెళ్ళకపోతే ఆతర్వాత Con(uct bad అనికూడా వ్రాస్తానని బెదిరించటంతో కోటేశ్వర్రావు యిక చేసేదిలేక కుళ్ళి కుళ్ళి యేడుస్తూ టీ సి తీసికొని వెళ్ళిపోయాడు ఆరోజు పాఠశాలలో తానెంతో గర్వంగా, విజయోత్సాహంతోటి కవిపించాడు అందరికీ కాని ఏంలాభం?

అదందా క్షణికమే ఆరాత్రి తనకు నిద్రపట్టలేదు ఏవో కుర్రతనంలో చేసిన చిన్నతప్పుకు యింత పెద్దశిక్షా! ఇప్పుడు కోటేశ్వర్రావు యెక్కడికి పోతాడు? ఇదే తన కొడుకయితే తనేం చేసేవాడు? ఈ ఆలోచనల్తో తనకు మనశ్శాంతి లేకుండాపోయింది కాని కాలం యిలాటి విషయాలను ఎన్నిటినో అప్పటి కప్పుడు కొత్తగానే ఉంచి కాలక్రమేణా పాతపరిచి మన స్మృతిపథం నుంచికూడ తప్పించేస్తుంది ఆనాడు టీ సి పుచ్చుకుని స్కూలు బయటకు వచ్చేసి బాహ్యప్రపంచంలో పడ్డ అల్లరి కోటేశ్వర్రావు యీనాడు యిలా ఉన్నాడంటే తనకళ్ళను తానే నమ్మలేకపోతున్నాడు ఈ పాత ఆలోచనలతో మగతగా నిద్రపట్టేసింది ఆంజనేయులు మేష్టారికి మెలకువ వచ్చేసరికి మధ్యాహ్నము మూడయింది

* * *

"ఒరేయ్! కిష్టాయ్! Bath room లో సబ్బు తువ్వాలు పెట్టరా మొహం కడుక్కొని రండి మేష్టారూ!' అన్నాడు కోటేశ్వర్రావు'

అప్పుడే ఆ యింటికి అలవాటు పడిపోయినట్లయిన ఆంజనేయులుమేష్టారు తిన్నగా Bath room లోకి వెళ్ళి ముఖప్రక్షాళనం కావించుకుని వచ్చాడు ఆ సరికే హాల్లో టిఫిను సిద్ధం చేసేసింది ఆ ఇంటి ఇల్లాలు రాధ పిల్లలిద్దరుకూడా బుద్ధిమంతుల్లా తమ ప్లేట్లముందు కూర్చున్నారు తినటానికి సిద్ధంగా

"రండి మేష్టారూ' కూర్చోండి' " అన్నాడు కోటేశ్వర్రావు!

'ఏమిటో! నీ అప్యాయత నా కొడుకునే మరిపిస్తోంది నాయనా!" అన్నారు అంజనేయులుమేష్టారు ఏమనాలోతోచక

"మాకంతటి భాగ్యమాండీ!" అంది అతివినయంగా రాధ

ఆంజనేయులు మేష్టారు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయిపోతున్నారు. ఆయన హృదయం ఉత్సాహంతో ఉప్పొంగిపోయింది టిఫిను ప్రారంభించారు అంతా సంతోషంతో టిఫిను తీసుకొన్నారు

"నా సంగతి చెప్పమన్నారు కదూ మేష్టారూ ! వినండి," అన్నాడు కోటేశ్వరరావు

"చెప్పు నాయనా ! చెప్పు నీ సంగతి తెలుసుకోవాలని ఎంతో కూతుహలంగా ఉంది," అన్నాడు ఆయన

టిఫిను పూర్తిచేసిన పిల్లలను లోపలికి తీసికెళ్ళిపోయింది రాధ

"ఆనాడు నేను తెలిసో తెలియకో మీ పట్ల అపచారమే చేశాను నిజానికి మీరంటే నాకు చాలా గౌరవభావం' మిమ్మల్నే అందరికన్న యెక్కువగా మనసులో ప్రేమించేవాడిని నాకు డ్రాయింగు నేర్చుకోవాలనీ, చక్కని బొమ్మలు వేయాలనీ అభిలాష ఉండేది దానికి తోడు మన డ్రాయింగు మేష్టారు కూడ నాకు తగిన తర్ఫీదు యిచ్చారు ఆ పిచ్చిలోపడి సినీమాతారల కార్టూనులు ప్రాక్టీసు చేస్తున్నాను ఆ రోజు రమణారెడ్డి బొమ్మ వేస్తున్నాను పక్కనే ఉన్న మాధవరావు దానికింద "మా లెక్కల మేష్టారు — మాష్టర్ రమణారెడ్డి" అని వ్రాశాడు లెక్కలు వినకుండా బొమ్మలు గీయటమే నేను చేసిన తప్పు పని బొమ్మక్రింద వ్రాత లేకపోతే మీరు అంత కోపగించుకునేవారు కారు. నాకు తెలుసు, కాని ఏం లాభం ? నిజం చెప్పేలోపునే మీరు హెడ్మాష్టరుగారి దగ్గరకు పంపేశారు," అన్నాడు

"నిజమే ! తలచుకుంటే ఇప్పుడు సిగ్గేస్తోంది — అలా యెందుకు తొందరపడ్డానా ?" అని అంటూ బాధపడ్డారు ఆంజనేయులుగారు !

"T C యిచ్చి పంపేసిన హెడ్మాష్టారిమీద కోపం రాలేదు నాకు యింటికి వెళ్ళి యీ విషయం చెప్తే మా అమ్మా నాన్నా నన్ను బతకనియ్యరు ఈ విషయము యెవరికి చెప్పినా యెవరూ నన్ను దగ్గరకు రానియ్యరు అందుకే ఎవరికీ చెప్పకుండా మా మేనమామదగ్గర కొచ్చేశాను ఆయనో కంట్రాక్టరు సంగతంతా ఆయనకు చెప్పేశాను ఆయనంటే నాకు చనువు ఆయన అంతా విన్నారు 'పోనీ యిక్కడ చదువుకో' అన్నారు ఇక చదువుపై దృష్టి పోయిందన్నాను అంతే, కంట్రాక్టుల్లో తన చేతిక్రింద వేసుకుని పదేళ్ళు తిప్పాడు అందులో కష్టసుఖాలు, లాభనష్టాలు బాగా వంటబట్టాయి నెమ్మది నెమ్మదిగా స్వంతకాంట్రాక్టులు తీసికోసాగాను .." అన్నాడు కోటేశ్వరరావు

"అదృష్టవంతుడవు నాయనా !" అన్నారు మేష్టారు

"అదే మేష్టారూ, చెప్పేది! ఆ అదృష్టానికి కారణం మీరు, ఆధారం మీరు, నాందీ పురుషలు మీరు మీరే కనక ఆనాడు అలా చేసిఉండకపోతే ఏ స్కూలు ఫైనలు పాసయ్యో, బియ్యే పాసయ్యో ఉద్యోగంకోసం తిరిగితిరిగి ఓ గుమాస్తాగా తయారయి .. భార్యాపిల్లలను పోషించుకోలేక సతమత మయ్యేవాడిని 'భగవాన్! .. అంతా మా మేష్టారి చలవ' అనుకుంటూ ఇప్పటికీ మిమ్మల్నే నమ్ముతున్నాను . " అంటూ తన అచంచల విశ్వాసాన్ని వెలిబుచ్చాడు కోటేశ్వర్రావు

"నాయనా! నీ అభిమానానికి కృతజ్ఞత! నా మీద నీకున్న గౌరవాభిప్రాయంమూలాన అలా గనిపిస్తోందికాని . నిజంగా నేను చేసింది నీ జీవితానికి తీరని అపచారమే లేకపోతే నువ్వీపాటికి ఏ డాక్టరో ఇంజనీరో అయేవాడివేమో," అన్నారు మేష్టారు.

"అక్కర్లేదు మేష్టారూ ఈ జీవితానికి ఇది చాలు ఇంతకన్నా నేను కోరేది లేదు .నా జీవితం ఇలా ఉండడానికి కారకులు ముగ్గురే ముగ్గురు అందులో ప్రథములు మీరు . . రెండవవారు మా మేనమామ " అన్నాడు కోటేశ్వర్రావు.

"అవును, ఆ సమయంలో ఆయనే కనక నిన్ను ఆదరించి దారి చూపకపోతే యేమయేదో, అయితే మరి ఇక మూడవవా రెవరు?" అన్నారు అంజనేయులుమేష్టారు అనుమానంగా!...

"సారే! . ఆయన్ని పాతకథ లన్నీ చెప్పి విసిగెత్తిస్తే కాని లేవరా ఏమిటి? . యివిగో! .లేచి ఆయన్ను కట్టుకోమనండి," అంటూ అదే సమయములో రాధ నూతనవస్త్రాలతో అక్కడికి వచ్చింది

"మేష్టారూ! మీ సందేహానికి సమాధానం యీవిడే-నా మేనమామకూతురు. అంతా దీనిదే అదృష్టం ఇది యింట్లో అడుగుపెట్టిన వేళావిశేషం దినదినానికి నా జీవితపంథా అభివృద్ధి కాసాగింది," అంటూ లేచాడు కోటేశ్వర్రావు

ఆంజనేయులుమేష్టారి కళ్లు చెమ్మగిల్లాయి ఆ సంసారం చూస్తుంటే ఆయన మనస్సు ఆనందంతో పరవళ్లు త్రొక్కింది

"ఇలా ఈ కుర్చీలో కూర్చోండి మేష్టారూ! " అంటూ కోటేశ్వర్రావు ఆంజనేయులు మేష్టార్ని ఇంకో కుర్చీలో కూర్చోబెట్టి బట్టలుపెట్టాడు ఆదంపతులు యిద్దరూ ఆయన పాదాలకు నమస్కరించారు. ఏమాశీర్వదించాలో అర్థం కాలేదు మేష్టారికి "ఓ భగవంతుడా! ఈ సంసారానికి యేలాటి అపకారమూ, కీడూ జరగకుండా కాపాడు తండ్రీ!" అంటూ మనసులోనే ప్రార్థించాడు

కోటేశ్వర్రావు కోర్కెపైన ఆంజనేయులుమేష్టారు కొత్తబట్టలు కట్టుకున్నారు తాను రిటైరయినపుడు జరిగిన సన్మానానికన్న యీ ఆదరణకు ఆయన తట్టుకోలేకపోతున్నాడు। ఆ సాయంత్రము యిక ఆయసి మాటతో సేయలేక ఆంజనేయులుమేష్టార్ని తీసికెళ్ళి వాళ్ళ పెద్దబ్బాయి యింటిదగ్గర దిగవిడచివచ్చి. తన ఋణం కొంతవరకు తీర్చుకున్నట్లు స్వేచ్ఛగా గాలి పీల్చాడు కోటేశ్వర్రావు

శిష్యుడు చేసిన సత్కారాన్నీ, చూపిన ఆదరాన్నీ తలచి పదేపదేసార్లు మురిసిపోయారు ఆంజనేయులుమేష్టారు। తన జీవితంలో అంతకంటే ఇంకేం కావాలి? ఇంతలోనే చటుక్కున ఆయనకో ఆలోచన తట్టింది నిజానికి తానీ సత్కారానికి, ఆదరానికి తగునా? నిజంగా తానేనా కోటేశ్వర్రావు ఉచ్ఛస్థితికి బాధ్యుడు? ఈ ఆలోచన మనస్సులోకి రాగానే మూడు రోజులక్రితం తనకు కనిపించిన మరో శిష్యుడు రాజేశ్వర్రావు కళ్ళముందు కొచ్చాడు — "ఏం చేస్తున్నావు రాజేశ్వర్రావు?" అని పలకరిస్తే, 'ఏం చేయను మేష్టారూ। బి ఏ పాసయాను ఏం లాభం? నిరుద్యోగ పిశాచం నన్ను పట్టుకు పీడిస్తోంది ఆ పాడు పరీక్షలు పాసవకుండా చేసినా బాగుండేది మీరు. హాయిగా కూలన్నా చేసికు బ్రతికేవాడ్ని ఈ చదువు చదివి కూలి చేయాలంటే— అంటూ ఓ రకంగా తన నిరుద్యోగ స్థితికి, తన జీవిత నిస్పృహకు తానే పరోక్షంగా కారణ మన్నట్టు ఆదేశించి పోయాడు

నిజమే। రాజేశ్వర్రావు స్థితికీ తానే కారణము। కోటేశ్వర్రావు స్థితికీ తానే కారణం' అసలు తనెవ్వరు? కావాలని తనేమన్నా చేశాడా తన విధి ప్రకారం ఆయా సమయాల్లో అలా చేశాడు. అసలు తను చేసే దేమిటి? తనచే చేయించాడు ఆ సర్వశక్తిసంపన్నుడు, సర్వాంతర్యామి ఆ భగవంతుడే ఆయన లీలలు అద్భుతము ఎవ్వరికీ అంతుచిక్కవు' లేకపోతే కోటేశ్వర్రావును కోటీశ్వరుడు అయేలా చేయాలని అనుకున్నాడా' రాజాలా తిరగాల్సిన రాజేశ్వర్రావు ఏ రోజు కారోజు తిండి లేకుండా యిబ్బంది పడాలని తను కోరాడా? అంతా భ్రమ। తన దేం లేదు అంతా ఆ పరమాత్ముని యిష్టాయిష్టాలు ఆ యిష్టాలు సాగేందుకు తానొక సాధనం మాత్రమే' తాను కేవలం నిమిత్తమాత్రుడే